

కథా కౌముది

# నా భాగ్యంబునం బత్నివై — నాగేంద్ర కాశి

**"హానీమూనా?" వంటింట్లోంచి కోడళ్ళు చిన్నగా నవ్వులు.**

"హానీమూనా?" కొంచెం ఆశ్చర్యం వ్యక్తం చేసి పేపర్‌లోకి తలదూరుస్తూ కొడుకులు.

"ఏంటీ హానీమూనా? సూపర్!" వేళాకోళం చేస్తూ కేరింతలు కొడుతున్న మనవలు, మనవరాళ్ళు.

ఆ రోజు మూర్తి అన్న చిన్నమాట పెద్ద కలకలమే రేపింది ఆ ఇంట్లో.

రోజంతా అలా ఆశ్చర్యాలతోనూ, పైకి కనబడని నవ్వులతోనూ వేళాకోళాలతోనూ గడిచిపోయింది మూర్తికి, సుధకి.

రాత్రిభోజనాలైన తర్వాత ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

కొంచెం మూర్తిగారి గురించి చెప్పుకుని ఆ తర్వాత వాళ్ళ పడగ్గదిలోకి వెళదాం అసలు విషయానికి.

మూర్తికి, సుధకి పెళ్ళై ముప్పైఐదు సంవత్సరాలైంది. ప్రేమపెళ్ళి. ఇద్దరు కొడుకులు.

అతిసాధారణంగానే ట్విస్టులేమీ లేకుండానే ఇద్దర్నీ బాగా చదివించాడు. ట్విస్టులేమీ లేవంటే కష్టాలు లేవని కాదు అర్ధం. ఆయన పడ్డ కష్టాలను, ప్రస్తావించి వాటిని వేరే ఏదో దేవుడు సృష్టించాడని వేరు చేయను. అవి జీవితంలో సర్వసాధారణం. సో. దాని గురించి మాట్లాడను.

మరి సుఖాలు కూడా భాగమే కదా!

నిజమే. కాకపోతే అవి ప్రస్తావించినప్పుడు మనసు కొంచెం ఆహ్లాదంగా ఉంటుందని. అంతే!

మూర్తి వ్యక్తిత్వం స్వతహాగా చాలా మంచిది. అది మంచి మనుష్యుల మధ్య, మంచి కుటుంబ విలువల మధ్య, మంచి పుస్తకాల మధ్య గడపడం వల్ల వచ్చిందనుకుంటాను.

అది 'ఆకాలపు' ప్రేమ కాబట్టి 'అకాలపు' ప్రేమ కాదు గనుక భార్యనే బాగా ప్రేమించేవాడు. సాధ్యమైనంతవరకూ ఏ కష్టం 'మనసుకు' కలిగించకుండానే చూసుకునేవాడు.

సుధ కూడా సాత్వికురాలు, ఉత్తమురాలు.

ఇద్దరు కొడుకులకూ చిన్నప్పట్నుంచీ 'కలిసుండడం, సాయపడడం, ప్రేమించడం' లాంటి వాటిని వాళ్ళు తాగే బూస్టులోనూ, హార్లిక్సుల్లోనూ తినే పప్పులోనూ, పెరుగులోనూ బాగా కలిపి పెట్టడం వల్ల అది బాగా జీర్ణమయ్యి, వంటబట్టి, రక్తంలో కలిసి పెళ్ళిళ్ళైనా గానీ అందరూ కలిసే ఉంటున్నారు. కోడళ్ళు కూడా కొడుకులుకు తగ్గ భార్యలే. సుగుణశీలురే.

ఈ కుటుంబం - కోడళ్ళు, కొడుకులు, తాత మనవలు, నాన్నమ్మ మనవరాలును చూస్తే మన టీవీల్లో వచ్చే తెలుగు సీరియళ్ళలో ఉన్నంత వయొలెన్స్, స్వార్థం, కుళ్ళు కుతంత్రాలు, అర్థంలేని స్వగతాలు ఎక్కడా కనబడలేదు.

బహుశా నిజజీవితంలో అన్ని కుట్రలు, కక్షలు కార్పణ్యాలు ఉండవేమో అనిపించింది.

'భావకాలుష్యానికి' కొంచెం దూరంగా ఉన్న కుటుంబమది.

ఇక ముసలాళ్ళ పడగ్గది కొద్దాం.

"మీరేమన్నా పదహారేళ్ళ బాలాకుమారుడ్ని అనుకుంటున్నారా? హవ్వ! ఎవరన్నా వింటే నవ్విపోరూ! షష్టిపూర్తి చేసుకునే వయసులో హనీమూనా? మీకేమన్నా బుద్ధుందా?

పొద్దుట్నుంచీ తల తీసేసినట్టయ్యింది. వాళ్ళ మధ్యలో తిరగలేక చస్తున్నాను. మీకేం మగమహారాజు.

"ఏం. వింటున్నారా?" అంది సుధ మూర్తితో మూతి తిప్పుకుంటూ

"నేనేం తప్పన్నాను. పెళ్ళైన కొత్తల్లో హనీమూన్‌కి వెళదాం అనుకున్నాం. అప్పుడు కుదర్లేదు. ఇప్పుడెళ్దాం అంటున్నాను. ఏం తప్పా"

"తప్పుకాదా? వయసులో ఉండగా వెళ్ళేది హనీమూన్. ఈ వయసులో వెళ్ళేది తీర్థయాత్రలకీ, గుళ్ళూ గోపురాలు చూడ్డానికి"

"సుధా! నా సుఖాల కంటే కష్టాల్నే ఎక్కువ పంచుకున్నావ్. జీవితంలో ఎదగాలనీ, పిల్లల్ని ప్రయోజకుల్ని చేయాలని, కుటుంబ బాధ్యతలు పంచుకోవాలనీ ఇన్నాళ్ళు మనమెంతో కష్టపడ్డాం.

మన మన సొంత జీవితాల్ని ఎంతో త్యాగం చేశాం. అయినా ఇంకెన్నాళ్ళు బతుకుతాం. మహా అయితే నేనో పదేళ్ళు, నువ్వో పదిహేనేళ్ళు. ఏదో నా మనసుకు అలా అనిపించింది. ఆ ఒక్క కోరిక తీర్చాలనిపించింది. మళ్ళీ జన్మంటు ఉంటుందో లేదో! ఉన్నా నువ్వెవరో నేనెవరో అని మూర్తి కొంచెం తాత్వికతనూ, భావుకత్వాన్ని జోడించి తనకున్న పుస్తక పరిజ్ఞానంతో వాక్యాలు వదిలేసరికి సుధకి కన్నీళ్ళాగలేదు.

"సరే మీ ఇష్టం. కానీ హనీమూన్ కనిగాదు కాని ఏ పుణ్యక్షేత్రాలకనో చెప్పండి. హనీమూనంటే మరీ సిగ్గుగా ఉంది పిల్లల మధ్య" అంది మూర్తి గడ్డం పట్టుకుని బతిమాలుతూ.

"సరే అన్నావు. ఇంక ఏ మార్పూ లేదు. పేరులోనూ. మనమెళ్ళే ఊరులోనూ" అన్నాడు ఆనందంగా మూర్తి.

"ఇంతకీ ఏ ఊరండీ?" అడిగింది.

"సస్పెన్స్. రేపు ఓ నాలుగు జతల బట్టలు సర్దెయ్"

తరువాత రోజు పెద్దమనవడు కార్తీక్

"తాతయ్యా మీరెళ్ళే హనీమూన్‌కి నేను స్పాన్సర్ చేస్తా. చెప్పండి. ఎక్కడికి వెళుతున్నారు. ఊటీనా, కొడైకెనాల్ లేదా కొంచెం గ్రాండ్ గా ఏ·థాయ్ కన్నానా! టిక్కెట్ల దగ్గర్నుంచి అన్నీ బుక్ చేసుకొచ్చేస్తా. చెప్పండి త్వరగా" అన్నాడు.

మూర్తి మళ్ళీ షాకిచ్చాడు అందరికీ ఈసారి వెళ్ళేది 'కోనసీమ'ని చెప్పి.

"అక్కడేం ఉంది మావయ్యగారూ?" అని అడిగింది చిన్నకోడలు ఉష.

"అక్కడ గోదావరి ఉందమ్మా. గోదావరి సముద్రం దగ్గర కలిసే చోటుంది. దగ్గర్లోనే ఓ రిసార్టు ఉంది. చాలా ఆహ్లాదంగా ఉంటుందమ్మా. ఆ వాతావరణం ఆ మనుషుల మధ్య" అన్నాడు.

"సరే. మీ ఇష్టం. అక్కడ ముసలాళ్ళకు బాగానే ఉంటుంది లెండి" అంటూ నవ్వుతూ వెళ్ళిపోయాడు కార్తీక్.

ఆ తర్వాతి రోజు తెల్లవారు ఝామునే బయలుదేరారు సుధ, మూర్తి చిన్నకొడుకు కార్లో.

కారు వెనక అద్దం మీద ఎవరో 'లాంగ్ బ్యాక్ మ్యారీడ్' అని చిన్న ప్రింటవుట్ ఒకటి అంటించారు. అది చూసి నవ్వుకుంటూ కారెక్కారు ఇద్దరూ.

సిద్ధాంతం బ్రిడ్జి మీదుగా అంతర్వేది దగ్గర్లో ఉన్న ఓ రిసార్ట్ దగ్గర దిగారిద్దరూ మంచి కాటేజ్‌లో

మొదటి రోజు అంతా రిసార్ట్ వాళ్ళ బోటులోనే నర్సాపురం రేవు, అంతర్వేది రేవు చూసి వెనక్కి వచ్చేసారు.

రాత్రి ఎనిమిది గంటలకల్లా తమకిష్టమైనవన్నీ ఆర్డర్ తెప్పించుకుని అంటే కోనసీమలో దొరికే రొయ్యలవేపుడూ, కొర్రమీను చేపలపులుసూ, బొమ్మిడాయల ఇగురూ, పప్పూ చింతకూర లాంటివి భోంచేసారు. భోజనానికి ఓ గంటముందే మూర్తి పనుందని బయటికెళ్ళి మాంఛి ఫ్రెంచి విస్కీ యానాం నుంచి తెప్పించింది అక్కడ పరిచయమైన రిసార్ట్ వ్యక్తితో తెప్పించుకుని తాగి వచ్చాడు ఏమీ ఎరగనట్టు.

ఆ రోజు పౌర్ణమి.

తేటగా ఉన్న ఆ గోదారి నీళ్ళల్లో చంద్రుడు తీరిగ్గా తన మొఖం ఎలా ఉందో చూసుకుంటున్నట్టున్నాడు.

పాపం దాన్ని చెడగొడుతూ రెండు వేట మరబోట్లు స్పీడుగా వెళ్ళిపోయాయ్. వేటనుంచి తిరిగొస్తూ కొంచెం నాటుసారా బిగించి ఈలపాటలు పాడుతూ వెళ్ళిపోతున్నారు.

దూరంగా ఓ రేవుదగ్గర ఏటి గట్టుమీద గడ్డిమంట వేస్తున్నట్టున్నారు. గట్టుమీద పాకల్లో ఉన్న గేదలకి దోమలు గుటాకుట్టకుండా. అదికూడా వెన్నెల్లో కలిసిపోయి మేఘం లాగుంది.

లంగరేసి కట్టుకున్న పడవలో చిన్నచిన్న పొయ్యిలు వెలుగుతున్నాయ్. ఇద్దరూ భోంచేసాక బయటికొచ్చారు వాహ్యాళికి.

"చూడు. ఎంతందంగా ఉందో! ఇప్పుడేమంటావ్?" అన్నాడు మూర్తి పచ్చికమీద నడుస్తూ.

"చాలా బావుందండీ. నాకు తెలుసు మీ టేస్టు" అంది.

"మరెందుకు వద్దు వద్దు" అన్నావ్.

"అడిగిన వెంటనే 'సరే' అంటారా ఏమిటీ"

"అవును. అది మీ సహజ గుణంకదా"

"పెద్దోడు పుట్టినప్పుడు ఇక్కడ అంతర్వేదికి వద్దామనుకున్నాం కదండీ" అంది.

"అవును. ఇంకా గుర్తుందే నీకు"

"అప్పుడే కదా మావయ్యగారు చనిపోయారు"

"అవును సరిగ్గా నేను సంపాదించే టైముకి లేకుండా పోయాడూ మా నాన్న. ఎంత బాగా పెంచాడు మమ్మల్ని. ఋణం తీర్చుకోనివ్వలేదు" అన్నాడు ఒక్కసారిగా బాధతో.

ఇన్ని సంవత్సరాలైనా గుర్తొచ్చినప్పుడల్లా ఏడుస్తాడు మూర్తి చిన్నపిల్లాడిలా. ఆ విషయం సుధకి తెలుసు.

"మన ఊరు కూడా దగ్గర్లోనే కదండీ. ఇంత మంచిగాలినీ, ఊరుని వదిలేసి మనం వాళ్ళదగ్గరెందుకు. ఇక్కడికే వచ్చేద్దాం" అంది టాపిక్ డైవర్ట్ చేస్తూ సుధ.

"అసలు మన ఒప్పందం గుర్తుందా మీకు" అంది మళ్ళీ మూర్తి మాట్లాడకపోయేసరికి.

"ఆఁ గుర్తుంది. మన పెద్దమనుషుల ఒప్పందం. ఖచ్చితంగా యాభై సంవత్సరాల వరకే ఉద్యోగం చేయాలి. ఓ అరెకరం కొబ్బరి తోట కొనుక్కోవాలి. మన పాతింట్లోనే ఉండాలి. ఆ తోటలో వాలు కుర్చీ వేసుక్కూర్చుని యానాం నుంచి ఓ బాటిల్ తెప్పించుకుని, కొబ్బరి నీళ్ళల్లో కలుపుకుని ఓ రెండు పెగ్గులు వేసి ఏ పుస్తకమో చదువుకుంటూ, కాలం గడిపేయాలి" అన్నాడు మూర్తి.

"ఆఁ ఆగండాగండి. అంతా కరెక్టేగానీ ఉంది గానీ బాటిల్ మన ఒప్పందంలో లేదు. అయినా కొంచెం తేడాగా ఉన్నారు. ఒక్కసారి ఇలారండి. ఏదో వాసన వస్తుంది. ఏమైనా తాగారా? మీరు" అంది. తాగినట్టు కనిపెట్టేసిందని మూర్తికి అర్థమైపోయింది.

"ఏం ఎందుకు లేదు. బాటిల్ మన ఒప్పందంలో! పెద్ద రాజ్యాంగానికే ఎన్నో సవరణలు చేశారు. మన ఒప్పందం ఒక లెఖ్ఖా ఇది ఓ చిన్న సవరణ అనుకో" అన్నాడు నవ్వుతూ టాపిక్ డైవర్ట్ చేసానని ఆనందపడుతూ.

మూర్తి అప్పుడప్పుడూ కొంచెం తాగుతాడు. సుధకి ఇష్టంలేకపోయినా తప్పక ఒప్పుకుంటుంది. కానీ 'సరే' అంటే ఇక ఇంట్లోనే మొదలు పెడతాడని తాగినప్పుడల్లా చిన్నపాటి యుద్ధం చేస్తూంటుంది. మూర్తి ఆ యుద్ధాలలో ఆరితేరాడు. విజయం సాధించాడు అని కాదు అర్థం.

అలా నడిచి వెళ్ళిపోతున్నారు వారిద్దరూ వెన్నెల్లో గతంలోకి గోదావరి పక్కగా.

"పెళ్ళైన కొత్తల్లో, పెళ్ళికాకముందు ఎలా ఉన్నావో ఇప్పుడు అలాగే ఉన్నావు. అదే కోపం. అదే నవ్వు. అదే అమాయకత్వం" అన్నాడు మూర్తి గంభీరంగా.

నవ్వింది సుధ.

వెన్నల్లో కొబ్బరాకులు, లేత అరిటాకులు మెరుస్తున్నాయ్. దూరంగా తుప్పల్లో ఉన్న మొగలిపొదల నుంచి ఆ వాసనను ఆయాసపడుతూ మోసుకొచ్చేస్తుంది గోదారి పిల్లగాలి.

"ఇప్పుడెందుకు గుర్తొచ్చిందో అయ్యాగారికి" అంది.

"ఏమో! అనాలనిపించింది. నిన్ను చూస్తే నాకు తేగలో చందమామలా అనిపిస్తుంది అప్పుడప్పుడు."

"అబ్బో భావకవిత్వం పరవళ్ళు తొక్కుతుందే!"

"సుధా! నీకు తెలుసా? గయోపాఖ్యానంలో గయుడు శ్రీకృష్ణుడి చేతిలో మరణం తప్పదని నిర్ణయించుకుని భార్యకు జాగ్రత్తగా ఉండమనీ, బాధపడవద్దనీ చెబుతూ ఒకమాటంటాడు.

"వరవశంబున జన్మమొందితివి, నా భాగ్యంబునం బత్నివై / చిర శశ్రూష యొనర్చి, తెల్ల గురులన్ సేవించి మెప్పొందితే / సరికిన్ నీకున్ నాకు దీజా ఋణమో చంద్రాస్య! నన్నున్ నిరం / తరమున్ నెమ్మది నుంచుకొమ్ము, కరుణన్ సైరింపు తప్పులన్' అని.

ఆ పుస్తకంలో నాకు నచ్చిన పద్యమిది. నిన్ను పెళ్ళిచేసుకున్నాక ఇంకా బాగా నచ్చిందిది.

నిజంగా నేను క్రితం జన్మలో ఏ తపస్సు చేశానో, ఏ వరం కోరుకున్నానో, ఈ జన్మలో నువ్వు నాకు దొరికావ్" అన్నాడు భావోద్వేగంతో.

"బహుశా! మీరా తపస్సు చేస్తున్నప్పుడు నేను మీ ఆశ్రమ సపర్యలు చేసే పరిచారికనై యుంటాను. మీకు నేనైతేనే కరెక్ట్ అని ఆ దేవుడు అనుకొని మనల్నిద్దర్నీ ఒకటి చేశాడు" అంతే ఉద్వేగంతో.

నిజంగా అంత ప్రేమ ఇద్దరి మధ్య, ఆ వయసులో ఉందనీ అలా మాట్లాడుకుంటారనీ మీరు నమ్ముతారా?

నాకు అనుమానమే. నిజమే! మనకల ప్రతీదీ అనుమానమే.

"నిజంగా చెప్పు. నిన్నెప్పుడైనా నేను బాధపెట్టానా? ఎప్పుడైనా నా మీద కోపమొచ్చి 'ఒక్కటి పీకాలి' వీడ్ని అనుకున్నావా" అడిగాడు మూర్తి.

"లేదు. ఎప్పుడూ లేదు. మీరెప్పుడైనా తిట్టినా నాకు బాధగా ఉండేది కాదు. ఎందుకంటే ఆ తర్వాత మీరు చూపించే ప్రేమ, బుజ్జగింపు ఎంతో బాగుండేది. దానికోసమైనా అప్పుడప్పుడూ మీరు కోప్పడితే బాగుండును అనిపించేది" అంది నవ్వుతూ.

అలా ఇంచు మించు రెండుగంటలదాకా ఇసుక తిన్నెల్లో, కురుస్తున్న మంచులో, గోదావరి అంచుల మీద నడుస్తూ మాటలు అలల్లా అలా సాగిపోతుండగా

"సార్. సాలా టైం అయిందండీ. ఇంకా అలాగెలితే పురుగూ పుట్రా ఉంటాయండీ" అన్నాడు రిసార్ట్‌లో పనిచేసే ఒక వ్యక్తి వచ్చి.

"రండి వెళ్ళిపోదాం. రేపు మళ్ళీ గుడికి వెళ్ళాలి" అంది సుధ.

రూములోకొచ్చి కాళ్ళూ చేతులూ కడుక్కుని ఇద్దరూ పడుకున్నారు. "ఏవండీ పడుకున్నారా?" అంది పడుకున్న ఐదు నిమిషాలకి సుధ.

"లేదు చెప్పు" అన్నాడు.

"నాకు భలే నచ్చిందండీ ఈ హానీమూన్. పెళ్ళైన కొత్తల్లో అయితే చెప్పుకోవడానికి పెద్దగా ఏమీ ఉండేవి కావు. అదే ఇప్పుడైతే జీవితాన్ని చూశాం. కలిసి అనుభవించాం. ఎన్ని రోజులైనా ఆ స్మృతుల్ని గుర్తుతెచ్చుకోవచ్చు. మీరు చెప్పిన గయోపాఖ్యానం లోనే ఇంకో పద్యం ఉంది.

'చందమామ తోడ జంద్రికయున్ బోవు
మేఘమాల తోడ మెరుపు బోవు
ప్రాణవిభుని తోడ వర పతివ్రతవోవు' అని

మూర్తి ఉలిక్కిపడి పైకి లేచాడు.

"ఏం నువ్వెప్పుడు చదివావు అది. అసలు నేను చదివే పుస్తకాలంటేనే ఆమడదూరం పరిగెత్తుతావ్ ఫర్వాలేదు. నాకు తెలియదే ఇన్నాళ్ళూ" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఎప్పుడో ఉబుసుపోక చదివాను అసలెలా ఉంటుందా అని. నాకు ఈ పద్యమొక్కటే నచ్చింది. ఇదొక్కటే అర్థమయింది" అంది.

ప్రేమగా దగ్గరకు తీసుకుని "ఐ లవ్యూ" అన్నాడు.

సిగ్గుతో రెండుచేతుల మధ్యా ఒదిగిపోయి

"ఎన్ని జన్మలైనా మీకే భార్యగా పుట్టాలని ఆ దేవుడ్ని కోరుకుంటా" అంది.

మూర్తి మాట్లాడలేదు.

తెల్లారింది.

అందరూ లేచారు.

మూర్తి లేవలేదు.

ఇంక మాట్లాడలేదు

●●●

Click here to share your comments on this story